సాక్షి మంచిర్యాల

సోమవారం, 28, అక్టోబర్, 2024



దండారీ సంబురం

దండారీ ఉత్సవాలకు గిరి గూడేలు ముస్తాబయ్యాయి. కాళ్లకు గజ్జెలు కట్టుకుని.. గుస్సాడీలు అడుగులో అడుగేస్తూ చేసే నృత్యాలు కనువిందు చేయనున్నాయి. 8లో▸



'ప్రాణ'ం తీసింది

ప్రాణహితనదిలో శనివారం ఈతకు వెళ్లి గల్లంతైన ముగ్గురు యువకుల్లో ఇద్దరి మృతదేహాలు లభించాయి. కన్నవారికి కడుపుకోత మిగిలింది. 8లో▸

గరిష్టం/కనిష్టం 33.6 /24.4

వాతావరణం

ఆకాశం కొంత మేరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఒకటిరెండు చోట్ల చినుకులు పడే అవకాశం ఉంది.

విరమణపై వివక్ష?

- రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్ చెల్లించని సింగరేణి
- అందని లాభాల వాటా, దీపావళి బోనస్
- ఏటా ఎదురుచూపులే..
- యాజమాన్యం తీరుపై విమర్శ



బోనస్ డబ్బుల కోసం ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు(ఫైల్)

శ్రీరాంపూర్: తమ రక్తాన్ని శక్తిగా మార్చి.. భూగర్భంలోని నల్లబంగారం వెలికి తీస్తున్న కార్మికులు సర్వీస్‌లో ఉన్నప్పుడే యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోంది. సంస్థ నుంచి రిటైర్ కాగానే.. వారిపై వివక్ష చూపుతోంది. ఇప్పటికే రిటైర్మెంట్ సత్కారాలను ఎత్తివేసిన యాజమాన్యం.. రిటైర్ అయిన కార్మికులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. సర్వీస్ ముగిసిన వెంటనే వారిని ద్వితీయ శ్రేణిగా పరిగణిస్తోంది. దీంతో లాభాల్లో వాటాతోపాటు, దసరా, దీపావళి సందర్భంగా ఇచ్చే అడ్వాన్స్, బోనస్ చెల్లింపులో వివక్ష చూపుతోంది. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులతో సమానంగా రిటైర్డ్ కార్మికులకు చెల్లించడం లేదు. నెలల తరబడి తిప్పించుకుని తర్వాత ఖాతాల్లో జమ చేస్తోంది. సంస్థలో టెక్నాలజీ వినియోగం పెరిగింది. శాప్ ద్వారా జీతాలు ఇస్తోంది. ఉద్యోగుల మస్టర్లు మొదలుకుని వారి పర్సనల్ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేసింది. ఐటీ వినియోగంలో ముందున్నామని చెప్పే యాజమాన్యం రిటైర్ అయిన కార్మికులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది. ఇది సంస్థ లోపమా లేక కావాలనే జాప్యం చేస్తోందా అనే విషయంపై ఎవరూ సమాధానం చెప్పడం లేదు.

ఏటా ఇదే తీరు..

రిటైర్డ్ కార్మికులకు హక్కుగా రావాల్సిన బెనిఫిట్స్ విషయంలో యాజమాన్యం ఏటా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన తర్వాతగాని యాజమాన్యం స్పందించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. బెనిఫిట్స్ ఇప్పించడంలో కార్మిక సంఘాలు కూడా వివక్ష చూపుతున్నాయని ఆరోపిస్తున్నారు. కార్మిక సంఘాల నాయకులను రిటైర్డ్ కార్మికులు బతిమాలుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగంలో నుంచి దిగిపోగానే తమను కానివారిలా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లు కంపెనీ కోసం కష్టపడ్డా.. రిటైర్ అయిన తర్వాత ఇటు యాజమాన్యం, అటు కార్మిక సంఘాలు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

అందని బెనిఫిట్స్..

సింగరేణి యాజమాన్యం 2023–24 ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల్లో 33 శాతం కార్మికులకు వాటాగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఒక్కో కార్మికుడికి రూ.1.7 లక్షలకుపైగా అందాయి. అక్టోబర్ 7వ తేదీన కార్మికుల ఖాతాల్లో జమ చేసింది. ఇక కోలిండియా ఒప్పందంలో భాగంగా దీపావళి బోనస్(ప్రాఫిట్ లింక్ రివార్డు, పీఎల్ఆర్ బోనస్) రూ.93,750 ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఈ మొత్తాన్ని కూడా అక్టోబర్ 25న కార్మికులకు చెల్లించింది. అయితే గత ఏప్రిల్ 31 నుంచి సెప్టెంబర్ 30 వరకు రిటైర్ అయిన కార్మికులకు మాత్రం ఈ బెనిఫిట్స్ ఇంకా అందలేదు. టెక్నాలజీ పెరిగినా.. రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్ ఇవ్వడంలో యాజమాన్యం వివక్ష చూపడం విమర్శలకు తావిస్తోంది. 2023, ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు పనిచేసిన కార్మికులకు లాభాల్లో వాటా, బోనస్ ఇవ్వాలి. ఈ ఏడాది మార్చి ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రిటైర్ అయిన వారికి దీపావళి బోనస్ చెల్లించాలి. వీరెవరికీ బెనిఫిట్స్ చెల్లించలేదు. జాప్యం ఎందుకని అడిగితే మస్టర్లు, ఇన్సెంటివ్, ఇతరత్రా అన్నీ లెక్కింపునకు సమయం పడుతుందని అధికారులు సాకులు చెబుతున్నారు.

ఒకే కుటుంబం స్ఫూర్తికి విరుద్ధం

ఒకే కుటుంబం – ఒకే లక్ష్యం – ఒకే గమ్యం అనే నినాదానికి యాజమాన్యం తూట్లు పొడుస్తోంది. ఆన్‌డ్యూటీ కార్మికులను ఒకలా.. రిటైర్డ్ కార్మికులను ఒకలా చూస్తోంది. బెనిఫిట్స్ ప్రకటించి తర్వాత విధుల్లో ఉన్న కార్మికులకు చెల్లించిన రోజే.. రిటైర్ అయిన కార్మికులకు కూడా బెనిఫిట్స్ ఇవ్వాలి. లేదా రిటైర్డ్ కార్మికుల కోసం ఓ తేదీ నిర్ణయించి చెల్లించాలి. అకారణంగా జాప్యం చేయడం సరికాదు.

– వేణుమాధవ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

'స్థానిక' రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ

- నేడు ఆదిలాబాద్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ బృందం
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరు కానున్న కలెక్టర్లు, బీసీ సంఘాలు
- జెడ్పీలో ఏర్పాట్లు చేసిన అధికారులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆదిలాబాద్ జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజలింగు

కైలాస్‌నగర్: రాష్ట్ర బీసీ కమిషన్ బృందం సోమవారం ఆదిలాబాద్ జిల్లాకు రానుంది. చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి హాజరుకానున్నారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కల్పించాల్సిన రిజర్వేషన్లు, దామాషా వివరాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమం కోసం జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సలహాలు, సూచనలు అందించేందుకు ఇద్దరు ఉద్యోగులతో కూడిన ప్రత్యేక హెల్ప్‌డెస్క్, అభిప్రాయలు తెలిపేందుకు వచ్చే వారి వివరాల నమోదు కోసం మరో ఇద్దరు ఉద్యోగులతో సమావేశ మందిరం వద్ద రిజిస్ట్రేషన్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు స్వీకరించనున్నందున ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు బీసీ సంక్షేమాధికారులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి, 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుమురంభీం, మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు మంచిర్యాల, 3నుంచి 4గంటల వరకు నిర్మల్ జిల్లాకు సంబంధించి అభిప్రాయాలు స్వీకరించనున్నారు. 4.30 గంటలకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించనున్నారు. ఆసక్తి గల వారు రాతపూర్వక సమాచారం, అభ్యర్థనలను నేరుగా కమిషన్‌కు అందించవచ్చని జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.రాజలింగు తెలిపారు. అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో ఆరు సెట్లతో కూడిన వెరిఫికేషన్ అఫిడవిట్‌ను తెలుగు, ఇంగ్లీష్‌లో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాటిని స్వీకరించేందుకు సైతం ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకోనున్న కమిషన్ బృందానికి వసతి కల్పించేందుకు గాను స్థానిక పెన్‌గంగ గెస్ట్‌హౌస్, హోటల్ పంచవటిలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

రూ.255 కోట్లతో రాళ్లవాగు కరకట్ట నిర్మాణం



పాలాభిషేకం చేస్తున్న యువజన నాయకులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లవాగుకు ఇరువైపుల కరకట్ట నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు రూ. 255 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కొన్నేళ్లుగా రాళ్లవాగు ఉధృతి కి జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు నీటమునుగుతున్నాయి. ఈ సమస్యను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కరకట్ట నిర్మించాలని కోరారు. ఈమేరకు శనివారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కరకట్ట నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన గంగాధర్ సీడీఎంఏకు బదిలీ కాగా, క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ చెన్నూర్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను మున్సిపల్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఒక డీఏ సరికాదు

మంచిర్యాలఅర్బన్: ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం ఒక్కదానినే విడుదల చేయడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు అన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చల అనంతరం కనీసం రెండు డీఏలు అయినా ఇస్తారని ఆశించామన్నారు. ఒక్క డీఏతో ప్రభుత్వం సరిపెట్టిందని తెలిపారు.

రేపు ఎంఈవోలకు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవలే మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించింది. వారికి విధులపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించే శిక్షణకు హాజరు కావాలని ఎంఈవోలకు విద్యాశాఖ సమాచారం ఇచ్చింది. జిల్లా నుంచి 18 మంది ఎంఈవోలు శిక్షణకు హాజరవుతారని డీఈవో యాదయ్య తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యక్షుడు కుమార్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులకు పాఠశాలలపై నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి మంచిర్యాలలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి కొత్త రక్తం అవసరమన్నారు. సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. జిల్లా కార్యదర్శి జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు కుమార్, పూర్వ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండయ్య సర్వీస్ రూల్స్, లీవ్ రూల్స్, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ తదితర విషయాలను క్లుప్తంగా వివరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, జయకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో జిల్లా కార్యదర్శి ప్రకాశ్, జిల్లా, మండల బాధ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుల విజయంలో కోచ్‌ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సాంబమూర్తి

నస్పూర్: క్రీడాకారుల ఎంపిక, విజయంలో కోచ్‌ల పాత్ర అత్యంత కీలకమైనదని అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, ఈగ మారయ్య అన్నారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్‌పై ఆదివారం సెమినార్, వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా నుంచి సుమారు 80 మంది పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. కోచ్‌లు అథ్లెటిక్స్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, మోడిఫికేషన్ రూల్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎం.విద్యాసాగర్, జి.అనిల్‌కుమార్, ఎం.సంతోష్, అకాడమీ చైర్మన్ పెంచాల శ్రీధర్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం కావాలి

- అడిషనల్ కలెక్టర్ మోతీలాల్



బెలూన్లు ఎగరేసి పోటీలు ప్రారంభిస్తున్న మోతీలాల్

లక్సెట్టిపేట: క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14, 19 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ పోటీలు మూడు రోజులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఐఈవో అంజయ్య, ఆర్సీవో గోపీచంద్, డీసీవో శ్రీధర్, ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించిన జిల్లాస్థాయి వాలీ బాల్ పోటీల్లో స్థానిక జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈశ్వరప్రసాద్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28న గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. బాయ్స్ హైస్కూల్‌లో జోనల్‌స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో కార్తీక్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థులను హెచ్ఎం పద్మజ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జోనల్‌స్థాయి వుషూ పోటీలకు నస్పూర్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కోచ్‌లు

నస్పూర్: త్వరలో జరుగబోయే జోనల్‌స్థాయి వుషూ పోటీలకు నస్పూర్ విద్యార్థులు ఎంపికయ్యారు. సీసీసీలోని ఆదిత్య స్కూల్‌లో అండర్ 17, 19 బాల బాలికల సెలక్షన్స్ ఆదివారం నిర్వహించారు. అండర్ 17 విభాగంలో సాయిప్రసన్న, హర్షిత, మన్విత, వైశాలి, యోగిత, కార్తికేయ, వంశీకృష్ణ, శ్రీనిత్, చరణ్, సర్గన్‌తేజ్ జోనల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19 విభాగంలో హాసిని, రిషికేష్, అంజి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కోచ్‌లు శివమహేశ్, వెంకటేశ్, నరేశ్ అభినందించారు.

కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి తీరాన శ్రీపద్మల్‌పురి కాకో ఆలయంలో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. కొత్త కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. గుస్సాడీ నృత్యాలతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. మహిళలు నవధాన్యాలను దంచి అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించారు.

ఆదాయం కోసం ఆర్టీసీ కసరత్తు

- సెల్‌టవర్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- బస్‌స్టేషన్లలో ఎల్ఈడీ, స్మార్ట్ టీవీలు
- అడ్వర్టైజ్‌మెంట్ యూనిపోల్స్ కోసం టెండర్లు



ఆదిలాబాద్: ఆదాయం పెంచుకునే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ప్రభుత్వం నుంచి రీయింబర్స్ అయ్యే నిధులు రావడానికి ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. స్వయంగా ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. ఓ వైపు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తూనే, ఆదాయం వచ్చేలా అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్టీసీ ఉన్నతాధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు లబ్ధి చేకూరనుండగా, సంస్థ సైతం లాభాలను ఆర్జించనుంది.

ఆధునీకరణ దిశగా బస్టాండ్లు..

ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీ ద్వారా రోజు లక్షల మంది ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ప్రయాణికులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో పలు సందర్భాల్లో ఆర్టీసీ విఫలం అవుతుందనే అపవాదులు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బస్టాండ్లను ఆధునీకరించాలని సంస్థ భావిస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి బస్‌స్టేషన్‌లో టీవీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. మేజర్ బస్‌స్టేషన్లలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. అలాగే ద్వితీయ శ్రేణి బస్సు స్టేషన్లలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రయాణికులకు వినోదం అందించడంతోపాటు ప్రకటనల ద్వారా ఆదాయం గడించాలని ఆర్టీసీ యోచిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉన్న 30 బస్‌స్టేషన్లలో 26 స్మార్ట్ టీవీలు, 10 పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది.

ప్రకటనల కోసం యూనిపోల్స్..


ఈరోజుల్లో ప్రకటనల ద్వారా ఆదాయం పెద్ద మొత్తంలో సమకూర్చుకోవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల డిపోల్లో మొత్తం నాలుగు పోల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ డిపో పరిధిలో 2, నిర్మల్, మంచిర్యాల డిపోల పరిధిలో ఒక్కోటి చొప్పున ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా సంస్థకు నిరంతరంగా ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఇంద్రవెల్లిలో కమీషన్ ప్రాతిపదికన పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించి టెండర్ ఆహ్వానించింది.

సెల్‌టవర్ల ఏర్పాటుకు నిర్ణయం...

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 32 బస్‌స్టేషన్లలో 76 సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. వీటి ద్వారా ప్రయాణికులకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా టవర్లు ఏర్పాటు చేయడం ద్వారా సంస్థకు ఆదాయం సైతం సమకూరనుంది. రీజియన్ వ్యాప్తంగా 19 జీబీయం సెల్‌టవర్లు, 23 ఆర్టీపీ, 34 స్మాల్ సెల్‌టవర్లను ఏర్పాటు చేయనున్నారు.

అడవుల రక్షణను నిర్లక్ష్యం చేయొద్దు

- టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం



చెట్లను పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ శాంతారాం

జన్నారం/దండేపల్లి: అడవులు, వన్యప్రాణుల సంరక్షణను నిర్లక్ష్యం చేయొద్దని కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) శాంతారాం సూచించారు. జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని టీడీసీలో రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో చెట్ల నరికివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీరో స్మగ్లింగ్ కోసం పని చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సీతాకోక చిలుకల గార్డెన్‌ను పరిశీలించారు. తర్వాత తాళ్లపేట రేంజ్ తానిమడుగులో ఇటీవల చెట్లు నరికివేసినప్రాంతాన్ని డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్, రేంజ్ అధికారి సుష్మారావుతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెట్లు నరికినవారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. శాంతారాం వెంట రేంజ్ అధికారి శ్రీనివాస్, డీఆర్వో తిరుపతి, సెక్షన్ అధికారులు ఉన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

- అదనపు కలెక్టర్ మోతీలాల్
- 'ఎల్లంపల్లి'లో చేపపిల్లల విడుదల



ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేపపిల్లలు విడుదల చేస్తున్న మోతీలాల్, కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ఆదివారం చేప పిల్లలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపపిల్లలతో మత్స్య సంపద పెరుగుతుందని, మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో 320 మత్స్యకార సొసైటీలు ఉండగా, 120 సొసైటీలకు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీల ద్వారా చేపలు అమ్ముకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో లక్ష చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ భాస్కర్, కాంగ్రెస్ హాజీపూర్ మండల అధ్యక్షుడు తోట రవి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, విశ్వనాథ ఆలయ కమిటీ చైర్మన్ దొంతుల ముఖేశ్, నాయకులు చిట్ల సత్యనారాయణ, దొమ్మటి సత్తయ్య, రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్, కోటి సత్తయ్య, ఒడ్డె బాలరాజ్, డేగ బాపు, నాయికిని సురేందర్, రఫీక్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ గెస్ట్‌హౌజ్ సీజ్


గెస్ట్‌హౌజ్ సీజ్ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రైవేటు గెస్ట్ హౌజ్‌లో వ్యభిచారం నిర్వహిస్తుండడంతో పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో ఇంటిని గెస్ట్ హౌజ్‌గా మార్చుకుని వ్యభిచారం దందా నడిపిస్తున్నారని సమాచారం అందింది. గత ఆగస్టు 20న పోలీసులు ఆకస్మికంగా గెస్ట్ హౌస్‌పై దాడి చేయగా ఓ మహిళతోపాటు ఏడుగురు విటులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో పోలీసులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆర్డీవో రాములు ఆదేశాలతో తహసీల్దార్ రఫతుల్ల హుస్సేన్, సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలిసి గెస్ట్‌హౌస్‌ను సీజ్ చేశారు. వ్యభిచారం దందా నడిపించిన సాయినాథ్ రెసిడెన్సీ, వెంకటేశ్వర లాడ్జీతోపాటు ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని గెస్ట్ హౌస్‌ను సీజ్ చేయడం చర్చనీయాంశమైంది.

ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

- కమాండెంట్‌కు వినతి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పోలీసుల భార్యలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకే పోలిస్ విధానం అమలు చేయాలని హాజీపూర్ మండల గుడిపేట 13వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఇటీవల బెటాలియన్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై ఆందోళన చేశారు. ఈ ఆందోళనలకు బాధ్యులను చేస్తూ హెడ్ కానిస్టేబుల్ కె.సతీశ్ రాం, కానిస్టేబుళ్లు జి.శ్రీనివాస్, జి.గోపి, ఆర్.రవి, పి.శివబాలకృష్ణను సస్పెండ్ చేశారు. దీంతో కానిస్టేబుళ్ల భార్యలు ఆదివారం కమాండెంట్ వెంకటరాములును కలిశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. అంతకు ముందు బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. సస్పెండ్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఒకే పోలీస్ విధానంతో నిరసనలు చేపట్టకుండా మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు కొనసాగిస్తున్నారు.

కొవ్వొత్తులతో నిరసన

ఒకే పోలీసు విధానం అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పోలీసుల భార్యలు రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

దండారీ సంబురం

- ఉత్సవాలకు గిరి గూడేలు ముస్తాబు
- నేటి నుంచి పూర్తిస్థాయి ఉత్సవాలు ప్రారంభం
- ఆదివాసీల ప్రత్యేక పండుగగా గుర్తింపు
- ఉమ్మడి జిల్లాకు రూ.కోటి నిధులు
- ఒక్కో దండారీకి రూ.వెయ్యి

దండారీ ఉత్సవాలకు గిరి గూడేలు ముస్తాబయ్యాయి. కాళ్లకు గజ్జెలు కట్టుకుని.. గుస్సాడీలు అడుగులో అడుగేస్తూ చేసే నృత్యాలు కనువిందు చేయనున్నాయి. ఆదివాసీల డప్పులు, వాయిద్యాలతో ఉమ్మడి జిల్లాలోని గూడేలు మార్మోగనున్నాయి. దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో దండారీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.


నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీలు దండారీ ఉత్సవాలను పెద్ద పండుగగా భావిస్తుంటారు. దీపావళికి ముందు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలకు గిరిజన గూడేలు ముస్తాబయ్యాయి. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలను కొన్నిచోట్ల ప్రారంభం కాగా, సోమవారం నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా షురూ కానుంది. స్వరాష్ట్రంలో గుస్సాడీలకు ప్రాధాన్యత లభించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేస్తోందని మంత్రి సీతక్క ఇటీవల కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో ప్రకటించారు. ఒక్కో దండారీకి రూ.వెయ్యి చొప్పున అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో వెయ్యికిపైగా గూడెల్లో ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

గుస్సాడీల దీక్ష

ఎత్మసూర్ అనే దేవునికి మెక్కుకుని ఆ మెక్కును తీర్చుకోవడానికి గుస్సాడీ దీక్షను స్వీకరిస్తారు. నెమలి పింఛాలతో తయారు చేసిన టోపీని తలపై ధరించి శరీరానికి బూడిద, ఆముదం నూనె పూస్తారు. దీక్షలో కుర్చీ, మంచంపై కూర్చోవడానికి వీలు లేదు. చంకలో ఉన్న తోలును నేలపై పరిచి కూర్చుంటారు. గుస్సాడీలు దీక్షలు స్వీకరించే గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంటాయి. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి దండారీలు వెళ్తారు. వచ్చిన వారికి ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీ. వెళ్లిన చోట దండారీ ఆడతారు. వినోదభరితమైన, సమాజానికి ఉపయోగపడే నాటికలు ప్రదర్శిస్తారు. ప్రత్యేక వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంటుంది. గుస్సాడీల నృత్యం చేసిన తర్వాత చివరిగా 'చొచ్చోయ్.. చొచ్చోయ్ అంటూ ఉత్సవాలు ముగించడం ఆనవాయితీగా వస్తోంది.

వివిధ నృత్యాలు

గుస్సాడీలు..నెమలి ఈకలు పొదిగిన టోపీ, తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, జింకలేదా, మేక చర్మాన్ని ధరించి నృత్యాలు చేస్తారు. డప్పులతోపాటు, పేప్రే, తుడుం, కాలికోమ్ తదితరాలను వాయిద్యాలుగా వాడతారు. భోగి నుంచి ప్రారంభమై, కోలబోడితో ఉత్సవాలు ముగుస్తాయి. ఆయా గూడేల్లో భోగి కార్యక్రమాలు ముగిశాయి.


గుస్సాడీలకు భేటింగ్ అవుతున్న మహిళలు


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

భోగితో ప్రారంభమై..కోలబోడితో ముగింపు

భోగి పండుగతో దండారీలు ప్రారంభమై కోలబోడితో ముగుస్తాయి. గుస్సాడీ దండారీ ఏ గ్రామంలో ఉంటుందో ఆ గ్రామంలో వారు భోగి నిర్వహిస్తారు. అదే రోజు నుంచి గుస్సాడీ నృత్యాలు ప్రారంభమవుతాయి. దండారీల్లో అనేక రకాలున్నాయి. భేటికోలా, మానుకోల, సదర్ కోలా, కోడల్‌కోలా, కలివల్‌కోలా వంటి ఉన్నాయి. కోలలతో మహిళలు, పురుషులు దండారీ నృత్యాలు చేస్తారు. చివరిరోజు కోలబోడి చేస్తారు. ఇళ్లు శుభ్రంచేసి గ్రామస్తులు, పెద్దలు గ్రామశివారులోని జమ్మిచెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే ఆభరణాలు ఓ చెట్టుకు కట్టి హారతి ఇస్తారు.

నిష్టతో..



దండారీ వేడుకలను నియమ నిష్టలతో జరుపుకుంటాం. భోగి నుంచి ప్రారంభమయ్యే ఉత్సవం కోలబోడి వరకు కొనసాగుతుంది. దండారీ రోజుల్లో ఆద్యంతం ఉత్సాహభరితంగా ఉంటుంది. ఉత్సవాలు జరిగే వరకు గ్రామం అంతా ఒకే చోట చేరి ఉల్లాసంగా గడుపుతాం. ఈ పండుగ మాలో ఐక్యతను చాటుకుంటుంది.

– రాయిసిడాం జంగు, రాయిసెంటర్ సార్మెడి, హట్టి

తరాలుగా వస్తున్న ఆచారం



తరతరాలుగా వస్తున్న ఆచారం దండారీ ఉత్సవం. తాతముత్తాతల నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికి కాపాడుకుంటూ వస్తున్నాం. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గుస్సాడీ, ఉత్సవాలతో తెలుస్తాయి. ఏటా నిర్వహించే వారే కాకుండా నూతనంగా కూడా దండారీలను నిర్వహిస్తుండడం..భక్త ప్రపత్తులను చాటిచెబుతుంది.

– పెందోర్ మోతిరాం, మాజీ ఎంపీపీ, కెరమెరి

నెమలి పింఛాల తయారీకి ప్రసిద్ధి


టోపీలను తయారు చేస్తున్న పాటగూడ వాసులు

కెరమెరి మండలంలోని పాటగూడ, ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ నెమలి పింఛాల టోపీల తయారీకి ప్రసిద్ధిగాంచాయి. గత పాతికేళ్ల నుంచి గ్రామస్తులు టోపీలు తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యు), కెరమెరి, తిర్యాణి, వాంకిడి తదితర గ్రామాలకు చెందిన వారు ఇక్కడి నుంచి నెమలి పింఛాల టోపీలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దీంతో ఆ గ్రామస్తులు పది రోజుల క్రితం నుంచి టోపీలు తయారీ పనులు ప్రారంభించారు. ఒక్కో టోపీ రూ.10 వేలు పలుకుతోంది. కేవలం తయారీ కూలీ రూ.3 వేలు తీసుకుంటున్నారు.

దండారీ బృందాలకు అతిథి మర్యాదలు


అతిథి మర్యాదలు చేస్తున్న డొంగర్‌గామ్ గ్రామస్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీలు తమ గ్రామాల్లో ఇతర గ్రామాల దండారీ బృందాన్ని ఆహ్వానించి అతిథి మర్యాదలు చేశారు. మండలంలోని డొంగర్‌గామ్‌కు సాలేగూడ, తుమ్మగూడకు దుబ్బగూడ గ్రామం దండారీ బృందం ఆదివాసీలు ఆదివారం అతిథులుగా వెళ్లగా స్వాగతం పలికారు. ఎత్మసూర్ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. దండారీ బృందం ఆదివాసీలు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి.

ఇంద్రాదేవి ఆలయంలో పూజలు

మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో దండారీ బృందం గుస్సాడీల పూజలు కొనసాగుతున్నాయి. పిట్టబొంగరం పంచాయతీ పరిధిలోని ధర్మగూడ దండారీ బృందం ఆదివాసీలు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. నైవేద్యాలు తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. ఆలయ పూజారి చహకటి సూర్యరావ్, గ్రామపెద్దలు జల్పతరావ్, నాగోరావ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–17 బాలుర రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు 14మంది ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి అజయ్, శంకర్, అర్జున్, సాయివిఠల్, రాహుల్, కుమురంభీం జిల్లా నుంచి జాగు, బాపూరా వు, శంకర్, సంతోష్ ఎంపికయ్యారు. అలాగే నిర్మల్ నుంచి చరణ్, తరుణ్, మంచిర్యాల నుంచి ఈశ్వర్, సుశిక్షిత్, సాయి ప్రదీప్ ఎంపికై నట్లు ఆదిలాబాద్ ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు తెలి పారు. వీరంతా ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు పెద్దపల్లిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, కోచ్ రాజు తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో వైష్ణవి, సునీత, సహస్ర, సింధు, చాందిని, అలేఖ్య వసుధ, శృతి, అంకిత ఎంపిక కాగా, బాలుర విభాగంలో లోకేష్, సతీశ్, హర్షవర్ధన్, సంతోష్, మధు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన వారు నేటి నుంచి ఈనెల 30వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు 'మోక్ష'


ద్యావంత్ మోక్ష

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ద్యావంత్ మోక్ష జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించగా, విద్యార్థి ఆర్ట్స్ గ్యాలరీలో ఎంపికైనట్లు తండ్రి రమేశ్ తెలిపాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక్కడే ఎంపికైనట్లు పేర్కొన్నాడు.

అమ్మవారి సన్నిధిలో నృత్యార్చన


పూజల్లో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్


నృత్యార్చన చేస్తున్న చిన్నారులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో ఆదివారం శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతిక సంస్థ కళాకారులు ప్రదర్శించిన నృత్యార్చన భక్తులను ఆకట్టుకుంది. కోటి గాజుల మండపంలో నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చన పేరిట కళాకారులు, చిన్నారులు కూచి పూడి, భరతనాట్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ మా సంస్థలో నృత్యం నేర్చుకున్న విద్యార్థులు అమ్మవారికి తమ నాట్యాన్ని సమర్పించేందుకు నృత్యార్చనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆలయ ఈవో విజయ రామారావు, వారిని శాలువాతో సత్కరించి మెమొంటోతో పాటు అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు నవీన్ శర్మ, నృత్య కళాకారులు పాల్గొన్నారు.

బాసరలో బీసీ కమిషన్ చైర్మన్ పూజలు

బాసర(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని ఆదివారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వైదిక బృందం వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటనకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతామన్నారు. ఆయా జిల్లాలకు చెందిన బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్ దృష్టికి తీసుకువస్తారన్నారు.

అట్టహాసంగా బాస్కెట్‌బాల్ పోటీలు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జోనల్ స్థాయి అండర్ –17 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 108 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో కృష్ణికపటేల్, అక్షయ, రోషిణీ (ఉషోదయస్కూల్), అంజలి, రమ్య, శ్రీవల్లిక, ఆర్తి, తేజశ్విని, వైశాలి(జెడ్పీ బాలికల పాఠశాల), దీక్షిత(జెడ్పీహెచ్‌ఎస్ జైపూర్, ఆయేషా (స్లేట్ స్కూల్), శరణ్య (జెడ్పీహెచ్‌ఎస్, జైపూర్) ఎంపికయ్యారు. బాలుర విభాగంలో సాయిచరణ్, రోహన్‌రావు(స్లేట్ స్కూల్), చార్లెస్, సిద్ధార్థ్ (కార్మెల్‌స్కూల్), కార్తీక్ (జెడ్పీ మంచిర్యాల), అఖిల్ (జెడ్పీహెచ్ఎస్ జైపూర్), హర్షిత్, అర్యాన్ (ఉషోదయ), సిద్ధార్థ (జెడ్పీహెచ్‌ఎస్, జైపూర్), ప్రేమ్, ఆశిష్(సీబీఎస్ఈ) ఎంపికయ్యారు. వచ్చే నవంబర్ 2 నుంచి మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ ఫణిరాజా, మాజీ కార్యదర్శి రేణి రాజయ్య తెలిపారు.

'ప్రాణ'ం తీసింది

- ఈతకు వెళ్లి నదిలో ముగ్గురు యువకుల గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు


జాకీర్ హుస్సేన్ మృతదేహాన్ని బయటికు తీసుకువస్తున్న ఎస్సై విక్రమ్


ఇర్షాద్ మృతదేహం

బెజ్జూర్: ప్రాణహితనదిలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకులు బతికి వస్తారని రెండు రోజులు ఎదురుచూసిన కన్నవారికి కడుపుకోత మిగిలింది. బెజ్జూర్ మండలం సోమిని ఎర్రబండ వద్ద ప్రాణహితలో శనివారం మధ్యాహ్నం ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. తలాయి సమీపంలో ప్రాణహితలో జాకీర్ హుస్సేన్(24), ఎండీ ఇర్షాద్ (19) ఆదివారం మృతదేహాలు లభ్యమయ్యాయి. నీటిలో తేలుతూ కనిపించగా స్థానికుడు ముత్తయ్య చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు.

దొరకని మరొకరి ఆచూకీ

బెజ్జూర్ మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీకి చెందిన జాకీర్ హుస్సేన్, ఎండీ మోహిజ్, ఎండీ ఇర్షద్ ప్రాణహితలో గల్లంతుకాగా, అందులో జాకీర్, ఇర్షాద్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మోహిజ్ ఆచూకీ దొరకకపోవడంతో గాలింపు కొనసాగుతోంది. కౌటాల సీఐ ముత్యం రమేశ్, బెజ్జూర్ ఎస్సై విక్రమ్ నాటుపడవలు, మహారాష్ట్ర పోలీసుల సహాయంతో బోటు ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్నారు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం పరిశీలించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

మండల కేంద్రానికి చెందిన మక్బూల్ హుస్సేన్ –కౌసర్ బేగం దంపతుల చిన్న కుమారుడు జాకీర్ హుస్సేన్ ఫుట్‌వేర్ షాప్ నడుపుతున్నాడు. కుటుంబ భారమంతా చూసే కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తను లేని లోటు ఎవరు తీరుస్తారని వారు రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టింది.

సరదాగా వెళ్తున్నానని..

ఇలియాస్–రషీద దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ప్రాణహితలో గల్లంతై మృతిచెందిన ఇర్షాద్ పెద్దకుమారుడు. మండల కేంద్రంలోని మొబైల్ షాప్‌లో ఉండేవాడు. బయటికు వెళ్లొస్తానని చెప్పి కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఇస్మాయిల్–షైన బేగం దంపతులకు ముగ్గురు కుమారులు. ఫుట్‌వేర్ షాప్ నడుపుతున్న తండ్రికి మూడో కుమారుడు ఎండీ మోహిజ్ తోడుగా ఉండేవాడు. సరదాగా వెళ్తున్నానని చెప్పి నదిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. గాలింపులో ఆచూకీ దొరకకపోవడంతో ఆ కుటుంబం బోరున విలపించింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాలను జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతోపాటు రావి మురళీకృష్ణ ఆదివారం పరామర్శించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ డోకే వెంకన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, నాయకులు పుల్లూరి సతీశ్, సకారాం తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు అండగా నేనున్నా..


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

ప్రాణహిత నదిలో యువకులు గల్లంతైన విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా నేనుంటానని అన్నారు. ప్రభుత్వ నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని సీఐ, ఎస్సైలను ఆదేశించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుసేన్, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, చింతలమానేపల్లి మాజీ ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య, సింగిల్ విండో చైర్మన్ ఓంప్రకాశ్, సిర్పూర్ తాలూకా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, కాంగ్రెస్ నాయకులు నాహీర్ అలీ, పెంటయ్య, సామల రాజన్న, సురేశ్‌గౌడ్, వెంకటేశ్, మల్లన్న ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డుకు చెందిన సత్యనారాయణ ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. గమనించిన దొంగలు శుక్రవారం రాత్రి సత్యనారాయణ ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి వెళ్లి ఇత్తడి, రాగి, బీరువాలో వస్తువులను ఎత్తుకెళ్లారు. మరో గదిలో అద్దెకు ఉంటున్న లక్ష్మి ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి లోపలికి వె ళ్లి రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం, పోలీసు సిబ్బంది ఆదివారం సంఘటన స్థలానికి వెళ్లి పరి శీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.